కథానిక

# వ్యథిత హృదయ

వాసిరెడ్డి కోటీశ్వరావు

విద్యుత్ కాంతిలో ధగధగ మెరుస్తూవుంది రైల్వే స్టేషను. వందలకొలది జనం గుమిగూడి వున్నారు. కొందరు రైలుకోసం ఎదురుచూస్తున్నారు. కొందరు పచార్లుచేస్తున్నారు ఇటూ—అటూ. మరికొందరు పాడుతున్నారు. రకరకాల కేకలు వినిపిస్తున్నవి చెవులు చిల్లులుపడేలా. స్టేషనంతా గందరగోళంగా వున్నది. ఇంతలోనే గుప్ గుప్ పొగవిడుచుకుంటూ, నెమ్మదిగా ప్రవేశించింది రైలు. ఎక్కేదిగే జనంతో కోలాహలం మరీ ఎక్కువయింది. కొద్దిసేపటిలో గల్లంతు కాస్తా సద్దుమణిగింది. జనమంతా బండిలో ఎక్కారు.

ఇంటరుక్లాసులోవున్నది ఆరుగురు. అంతా పెద్దకుటుంబాల్లో పుట్టిపెరిగినవారివలె వున్నారు. వారినిచూస్తే వుద్యోగస్తులని అనిపిస్తుంది. అయినా కాకపోయినా వాలకం అలానేవున్నది. ఆ పెట్టె మాత్రం చాల నిశ్శబ్దంగా వున్నది.

"ఇవ్వాళ బండి చాలా రష్‌గావున్నదికదూ?" అన్నది ఒకామె ప్రక్కనేవున్న భర్తతో ఆ నిశ్శబ్దాన్ని భంగంచేస్తూ.

ఔను అన్నట్లు తలపంకించాడు ఆయన. నిద్రించటానికి ఎవరిచోటుకోసం వారు ప్రయత్నం చేస్తున్నారు.

ఇంతలోనే బాబూ కానీ అంటూ తలుపు తెరచుకొని వచ్చాడు పదిసంవత్సరాల కుర్రాడు. మంచి ఎరుపు. చినిగిన బట్టలు, పీక్కుపోయిన పొట్ట, రేగిన జుట్టు.

ఇంద, ఓ పెద్దమనిషి ఆ కుర్రాడి చేతులో ఒక అణా పెట్టాడు. "పాపం దిక్కులేనివాడు. చిన్నతనంలోనె యీ గతిపట్టింది. ఈ దౌర్భాగ్యుడను ఏ తల్లి కన్నదో" అని ఒకాయన ఒక నిట్టూర్పు విడిచాడు.

ఇదంతా సుశీల గమనిస్తూనేవున్నది. ఆమె భర్తమాత్రం పడుకుని ఏదో ఆలోచిస్తున్నాడు ఈ గొడవంతా మనకెందుకులే అన్నట్లు. సుశీల మాత్రం అదోవిధంగా వున్నది. పలుకూ-వులుకూ లేదు. శిల్పంకొట్టిన రాయిలా వున్నది. కన్నులు విప్పి తదేకదీక్షతో 'ఒక్కమారు ఆ కుర్రాడివంక చూసి తలవంచింది. అంతా అగమ్యగోచరంగా వుంది. తన ప్రస్తుత జీవితం కనులముందర నాట్యమాడింది. తన అందచందం, తన బట్టలు, తన టూరింగ్సు, తన మిత్రులు ఒకటేమిటి, తను అనుభవిస్తున్న ప్రతివస్తువు కనులముందర ఒకదానితరువాత మరొకటి సినిమారీలులా గిర్రున తిరిగినయి. మళ్ళీ ఓ. పర్యాయం కుర్రాడివంక చూసింది. బాగా చూసింది, మళ్ళీతలవంచింది. ఈపర్యాయం తన పురాతన గాథ జ్ఞప్తికి వచ్చింది. సూర్యచంద్రాదులు నాట్యమాడే ఆ పెంకుటిల్లు, ప్రతిరోజు త్రాగి తూలుతూవుండే ఆ భర్త, నిప్పులు చెరిగే ఆ కన్నులు అతని హంటరు ఒకటేమిటి, సమస్తం జ్ఞప్తికొచ్చినవి. అమృతంలో విషంపోసి ఇచ్చినట్లయింది ఆమె పని. ఒకప్పుడు తను ఏ స్థితిలోవున్నదీ, నేడు ఏ స్థితిలోవున్నదీ అర్థం చేసుకోలేకపోయింది. ఒకనాడు అర్ధరాత్రివేళ అమావాస్య చీకట్లో ఎలా బాధపడిందో కూడా జ్ఞప్తికొచ్చింది. తన్ను తాను అసహ్యించుకొన్నది.

"ఏం అబ్బాయి! ఏవూరు నీది?" అన్నాడు సుశీల భర్త.

"ఈ వూరే."

"అంటే విజయవాడేనా?"

"ఆఁ."

"నీకు తల్లీ-తండ్రీ లేరా?"

"మా అమ్మ చచ్చిపోయిందని మా అయ్య చెప్పాడు. కొన్నాళ్ళకు ఆయన్నికూడా పోలీసులు పట్టుకెళ్ళారు. నాకు ఎవ్వరూ లేరు. అడు

కున్నాంటున్నా" అని ఒక్క నిమిషంలో తన గాథంతా చెప్పాడు.

"ఇలాంటివాళ్ళేనండి జేబులు కొట్టేది. ఇది అనుభవంమీద విషయం." అన్నాడు పైనుండి ఒకాయన.

"బాబూ నాకు ఆ సంగతి తెలియదు. నేను ఎప్పుడూ అడుక్కోను. మళ్ళీ మా అయ్యవచ్చిన తరువాత పనిచేసుకుంటా" అన్నాడు ఆకుర్రాడు.

ఈ మాటలన్నీ సుశీల వింటూవున్నది. ఒక వైపున అసహ్యం మరోవైపున ఆవేదన, ప్రేమ, అడకత్తెరలో పోకలా అయింది ఆమెపని. తన గాథంతా ఒక్కమారు వెళ్ళగక్కుదా మనిపించింది. కాని వెనువెంటనే తన ఆనందమయజీవితం జ్ఞప్తికొచ్చింది. తక్షణమేతనభర్త జ్ఞప్తికొచ్చాడు. తనకష్ట పరంపరలను ఏకరువు పెడదామనుకున్నది. అమృతతుల్యమైన తనజీవితం తనగౌరవం అడ్డుపడినవి. ఒకప్పుడు విషంకూడ అమృత తుల్యంగా సేవించిరి. కాని ఈనాడు, అందులో యీరేయి అమృతమే విషంగావున్నది. ఆమె ఒకస్త్రీ. ఆమెలోకూడ మాతృత్వం ఉరకలేస్తుంది కన్నకడుపు ఆవేదనపడుతుంది. ముద్దాడిన పెదిమలు ముందుకు సాగుతున్నవి. అయినా నిస్సహాయురాలు. ఆమెకు మోహం, ప్రేమ, కష్ట—సుఖాలు అన్నీ తెలుసు. ఏదిచేయాలో ఏదిచేయకూడదో తెలుసు. కాని తనసంతానానికి ఎందుకు తిలోదకాలిచ్చిందోకూడ తెలుసు. అవన్నీ ఈనాడు ఆమెను పెనవేసుకొని బాధించుతున్నవి. ఆమె తలవంచి అన్నీ ఆలోచించుతూన్నది. కాని ఏమి ఆలోచించుతూన్నదో ఆమెకే తెలియదు. ముందు వెనకల ఆలోచించే స్థితిలో లేదు. ఆ కుర్రాడు అలాగే నిల్చొని తదేకదీక్షతో చూస్తున్నాడు ఆమెవైపు.

"అమ్మా! ఆకలేస్తుంది" అన్నాడు ఆ కుర్రవాడు.

అమ్మ! ఆ శబ్దంలో యెంత గొప్పతనం ఉన్నది. ఇద్దరి ప్రేమఫలితంగా నేను అమ్మనయ్యాను కాని యీనాటి నేను ఆ మాటకు అర్హురాలనేనా! తనలో తను వాపోతుంది. ఎంతో బాధతో తలపైకెత్తింది. ఆ కుర్రవానివైపు చూడలేకపోయింది. కనులవెంట నీరు గిర్రున తిరిగింది.

"ఆదేమిటి?" అన్నాడు భర్త.

"నిపారవేసి అనాథలుగాలిస్తే తల్లులను చూస్తే అసహ్యంవేస్తుంది. జాలేస్తుంది, యేడుపొస్తుంది. ఏదైనాచేయ బుద్ధిఅవుతుంది. కాని ప్రతిదానికి సమాజం అడ్డువస్తుంది." అని ఎంతో ఆవేదనతో, ఉద్రేకంతో అన్నదిసుశీల అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. భర్తకు ఏమీ అర్థం కాలేదు.

"బాబూ పోతున్నా, అని క్రిందకుదిగాడు. గంటమ్రోగింది. ఇంజను కూసింది రైలుకదలింది. నలువైపులా చూసింది సుశీల. కుర్రాడు పోతున్నాడు. రామూఅంటూ కేకేసి క్రిందకు దుమికింది. వెంటనే చైన్‌లాగారు. బండి ఆగింది. క్రిందకు దిగారు. ఆమె మూర్ఛపోయింది. ఎత్తుకొని బండిలోనికి తీసుకొచ్చారు. బండి కదిలింది. ఒకగంటకు తెప్పరిల్లింది. "ఆ...అబ్బాయి... రాము...రాముఏడీ" అన్నది ఆతురతతో, ఆవేదనతో కళ్ళనీళ్ళు కారుస్తూ.

"ఎందుకు?" అన్నాడు భర్త.

మళ్ళా మూర్ఛిల్లింది. ఒకగంట తరువాత మళ్ళాఅన్నది 'రామూ' అని స్టేషను వచ్చింది. సుశీను పట్టుకొని క్రిందకుదింపాడు భర్త. ఆ రాత్రికి యిల్లుచేరారు. సుశీలమాత్రం రాత్రంతా 'రామూ' అంటూనే కాలంగడిపింది. అసలు విషయం చెప్పమని భర్త ఎంతగానో అడిగాడు. తనగాథను బయటపెట్టకుండా ఆగలేకపోయింది. యీనాటితో తనజీవితం సుఖాంతమో, దుఃఖాంతమో అవుతుందని అనుకున్నది. కళ్ళనీళ్ళను తుడుచుకుంటూ చెప్పసాగింది సుశీల.

నా పేరు వెంకుబాంబ నేను అయిదవఫారం చదివాను చదువుకున్న యువకుణ్ణి వివాహం చేసుకొని ఆదర్శంగా జీవించాలని అనుకున్నా, నాతండ్రి బీదవాడు. కట్నం ఇవ్వలేక ఒక త్రాగుబోతుకు బలిచేశాడు. కొద్ది రోజులమాత్రం ఆ మోహావేశంలో నన్నూ ఒక మనిషిగా చూశాడు అంతే ఎప్పుడో ఇంటికి చేరేవాడు. ఎప్పుడూ త్రాగుతూ తూలుతూ వుండేవాడు కన్నులు చింతనిప్పులవలె మెరుస్తూవుండేవి. అవి చూసి

నేను ఎంతో భయపడేదాన్ని, ఏదోవిధంగా అతన్ని సన్మార్గాన పెట్టాలని నిశ్చయించాను. కాని నా ఆశలు ఫలించలేదు నా జీవితం బూడిదలోపోసిన పన్నీరయింది. నా ఆశలు నిరాశలయినవి. సుఖాలకు మారు కష్టాలెక్కువయినవి. ప్రతిరోజు త్రాగి-తూలుతూ రాత్రి ఏ పదిగంటలకో ఇంటికి చేరేవాడు. ప్రతిమాటకు కళ్లు వురిమేవాడు. అంతేకాదు నెమ్మదిగా తన్నులు కూడా ప్రారంభించాడు ఆ రోజుల్లో బిడ్డలు లేరు. అందుకు ఎంతో సంతోషించాను. బిడ్డ వుంటే ఎంతగానో బాధ పడవలసివచ్చేది. బిడ్డలు లేనందుకు ఎంతో ఆనందించాను. తన్నుకూడ మితిమీరినవి. కష్టాలు ఎక్కువయినయి. ఇల్లు కాస్తా తాకట్టుక్రింద పోయింది. ఉన్న పొలం కాస్తా త్రాగుడికి అయిపోతూ వుంది. ఈ స్థితిలో బిడ్డ పుట్టాడు. చక్కనిచుక్క బిడ్డలు వద్దనుకున్న నేను నిజంగా ఎంతో మారిపోయాను. ఆ బిడ్డను చూస్తూ కూర్చుంటే కష్టాలన్నీ మరచిపోయి జీవితంలో ఒక కొత్త వెలుగు అని ఆశించాను. ఆ బిడ్డతోనే కాలం గడిపేదాన్ని, ఆ వున్న డబ్బు కాస్తా అయిపోయింది. దానితో నాకు బాధలు మరీ ఎక్కువయినయి. హంటరుతో నన్ను కొట్టనిరోజంటూ వుండేదికాదు. ఈ నాటికికూడ నా శరీరం హంటరు దెబ్బల మచ్చలతో నిండివున్నది. అయినా నా భర్తని గౌరవించేదాన్ని. ఎవరేదన్నా సహించలేక పోయేదాన్ని, నేనూ మనిషినే ఎంతవరకు సహించగలను. రంకులుకట్టడంకూడ సాగినయి. ప్రతిరోజు రాత్రిళ్ళు బయటకుగెంటి తలుపు వేసేవాడు. వానలో, చలిలో అలానే వుండేదాన్ని, బిడ్డ అంటేమాత్రం ఆయనకూ ప్రేమే. కుర్రాడికి మాత్రం బజారునుండి ఏవో తెచ్చేవారు. నేను మాత్రం పస్తులతో బయట పడివుండేదాన్ని. ఈ విధంగా ఆరుసంవత్సరాలు భరించాను. ఒకనాడు అర్ధరాత్రి యింటినుండి పారిపోయాను ఎందులోనన్నా దుమికి చచ్చిపోదామని. కాని ఆ పని చేయలేకపోయాను. నా బిడ్డపైవున్న ప్రేమ నన్ను పనిచేయనీయలేదు. మళ్ళీ ఇంటికివచ్చాను. అప్పుడే నాభర్త ఇంటికి వచ్చాడు. దీనితో నేను రంకుతనం చేస్తున్నాననే అనుమానం మరీ ప్రబలింది. హంటరుతో వెంటాడాడు శక్తికొలది పరుగెత్తాను బిడ్డను విడచి. బిడ్డమీద, జీవితం మీద ఆశలు వదలుకుందా మనుకున్నా. కాని వదలుకోలేక పోయాను. కాళ్ళుచేతులు వున్నంత వరకు కష్టపడుదామనుకున్నా. ఏనాటికైనా నా బిడ్డ నన్ను గుర్తించుతాడని అనుకున్నాను. అందుకనే చావలేకపోయాను నాలుగు రోజులు తిండిలేక తిరిగాను. తరువాతే మీవద్ద నౌకరీ కుదిరింది ... మీ భార్యచనిపోవటం. తరువాత మీ యౌవనానికి నేను బలిగావటం, భార్యాభర్తలవలె జీవితం సాగించగలగటం, లోకపునిందలను సహించటం, అన్నీ మీకు తెలిసినవే. "ఆనాటి రైలులో" రాము నా బిడ్డ.

"సుశీ! నీదిమాత్రం తప్పుకాదు. లోకంలో నీవు కులటవే నీచురాలివే. లోకం గుడ్డిది. లోకం అనుకొనేది ఒకటే నీవు చెడిపోయావని. ఎందుకిలా జరిగిందో లోకానికక్కర లేదు. నేనుమాత్రం నిన్ను అవమాన పరచను. కన్నకడుపు, కన్నతీపి, అందుకనే అంతబాధపడ్డావు" అన్నాడు దీనంగా భర్త రఘు.

అనేక పర్యాయాలు ఇద్దరూ రాముకోసం ఆదేబండిలో ఆదేస్టేషనులో చూశారు. రాము మాత్రం కనిపించలేదు. ఆమె హృదయం అతని కోసం ఆరాటపడుతునే వున్నది...

